క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీలు

మంగపేట: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా ములుగు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్సై గోదరి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో మేడారం జాతర విశిష్టత, పోలీస్ శాఖ భద్రతా ఏర్పాట్లు, వివిధ శాఖల విధులు, పరిశుభ్రత, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే విధంగా చిత్ర లేఖనం ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ములుగు జిల్లా స్థాయిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిని అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, ప్రజలు ఎవరైన ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని, ఆసక్తి గల వారు వారి సొంతంగా చిత్రలేఖనం వేసి మంగపేట, ములుగు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీల్లోపు అందజేయాలని ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని మైనార్టీ బాలికల కళాశాలలో ప్రవేశం పొందుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వందన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి ఆరు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కళాశాలలో 60 మైనార్టీ, నాన్ మైనార్టీ 20 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కళాశాలలో దరఖాస్తులను అందిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 7207998956 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హామీలు అమలు చేయాలి

వెంకటాపురం(కె): ఎన్నికల సమయంలో ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొమరం భీమ్ కాలనీలో గోండ్వానా సంక్షేమ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరం భీమ్ కాలనీలో 30 సంవత్సరాల నుంచి ఆదివాసీలు నివాసముంటున్నారని వారిపై గిరిజనేతరులు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ చట్టాలను ఏజెన్సీలో పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సునీల్‌రెడ్డి నియామకంపై హర్షం

కాటారం: బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా చంద్రుపట్ల సునీల్‌రెడ్డి నియామకంపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పూసాల రాజేంద్రప్రసాద్, గంట అంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొంత కాలంగా బీజేపీని బలోపేతం చేసే దిశగా శ్రమిస్తున్న సునీల్‌రెడ్డికి పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇవ్వడం సంతోషకరమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సునీల్‌రెడ్డి నేతృత్వంలో మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

మహదేవపూర్: బాధితులు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్లతో ఎస్సై మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామల్లో అసాంఘిక కార్యకలపాలు నిర్వహించకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు.

నాలుగు సిలిండర్ల చోరీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికాల విద్యాలయంలో నాలుగు సిలిండర్లు చోరీ అయినట్లు ఎస్ఓ కావ్య పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పండుగా సెలవుల నిమిత్తం వెళ్లడంతో వాచ్‌మెన్ బాధ్యత రహిత్యంతో సిలిండర్లు చోరీ అయినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళాలు పగులగొట్టి రెండు గ్యాస్ ఉన్న సిలిండర్లు రెండు ఖాళీ సిలెండర్లు తీసుకెళ్లిన్నట్లు తెలిపారు.

23న కమిటీల ఎన్నిక



చిట్యాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 23న అంబేడ్కర్ యువజన సంఘం (ఏవైఏస్) చిట్యాల, టేకుమట్ల కమిటీల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్ సాగర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మేధావులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని కమిటీల ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవైఏస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగుల రాజు, నాయకులు యుగేందర్, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



కప్, నగదును అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

ఏటూరునాగారం: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై గర్రం కృష్ణప్రసాద్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో గండెపల్లి సమ్మయ్య, వలుపదాసు పవన్‌ల జ్ఞాపకార్థం నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్ శుక్రవారం హోరాహోరిగా జరిగింది. 12 ఓవర్లకు స్టార్ లెవన్ జట్టు 74 పరుగులు చేయగా ప్రత్యర్థి జట్టు లెవన్ టైగర్స్ 74 పరుగులు చేశారు. మ్యాచ్ డ్రా కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించగా స్టార్ లెవన్ జట్టు ఆరు బంతులకు ఒక వికెట్ నష్టానికి 11 పరుగులు చేయగా లెవన్ టైగర్స్ జట్టు ఒక వికెట్ నష్టానికి 5 పరుగులు చేయడంతో స్టార్ లెవన్ జట్టు కప్‌ను గెలుచుకుంది. మొదటి బహుమతి గండెపల్లి సమ్మయ్య జ్ఞాపకార్థం అతడి కుమారుడు గండెపల్లి నర్సయ్య విజేత జట్టుకు రూ.15016ల నగదు, కప్‌ను, రెండో బహుమతి పవన్ జ్ఞాపకార్థం అతడి తండ్రి రమేష్ రూ.7516ల నగదు, కప్‌ను అదజేయగా ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజాపాషా, చిటమట రఘు, సర్దార్‌పాషా, నూతి రమేష్, ముక్కెర లాలయ్య, నార ప్రశాంత్, శ్రావణ్‌కుమార్, లక్కి, గణేష్, సందిప్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ట్రస్ట్ బోర్డు కమిటీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మైపతి అరుణ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర ట్రస్టు బోర్డు కమిటీ త్వరగా ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొరగట్ల లక్ష్మణ్‌రావు అధ్యక్షతన మేడారం జాతర అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి హాజరై జాతర నిర్వహణ కోసం ఏర్పాటు చేయనున్న ట్రస్టు బోర్డు కమిటీని త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. గోదావరి పరివాహక ప్రాంతంలో 205 కోయ వేల్పు జాతరలు ఉన్నాయని స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి నేటికి ఇంకా అవి ఇప్ప చెట్ల కింద, పూరి గుడిసెల్లోనే మగ్గుతున్నయన్నారు. ప్రతి వేల్పు జాతర అభివృద్ధికి రూ. 20 లక్షలు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడారానికి రూ.75 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజ నారాయణ, ప్రచార కార్యదర్శి అన్నెబోయిన సమ్మయ్య, మండల అధ్యక్షుడు మోకాళ్ళ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి యలం విక్రమ్, ఉపాధ్యక్షులు లక్షీనారాయణ, తాటి మహేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ములుగు రూరల్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

ములుగు రూరల్: పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను ములుగు శాఖ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగపద్మజ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి, ప్రధాన కార్యదర్శి సురేందర్, రౌతు రాజు, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని వివిద పాఠశాలలో పీఆర్‌టీయూ మండల శాఖ క్యాలెండర్ మండల శాఖ విద్యాధికారి గొంది దివాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ గోవిందరావుపేట మండల శాఖ అధ్యక్షుడు కె నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తులసీదాస్, జిల్లా అధ్యక్షుడు కాసర్ల రమేష్, ఉపాధ్యాయుడు కిషోర్ బాబు, కేశవరావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



గట్టమ్మ ఆలయం వద్ద నాయకులు

ములుగు రూరల్: భారతీయ జనతా పార్టీ జిల్లాలో బలోపేతానికి కృషి చేస్తానని నూతన ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ఈ మేరకు శుక్రవారం గట్టమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అనుక్షణం పోరాడుతానని, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్ష పదవికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, శ్రీమంతుల రవింద్రాచారి, చల్లూరి మహేందర్, దొంతిరెడ్డి రవిరెడ్డి, కొండారెడ్డి, కృష్ణకర్, కొత్త సురేందర్, గాదం కుమార్, విశ్వనాథ్, రాజన్న, నాగరాజు పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: ఎరువుల దుకాణాల్లో నకిలీ పరుగుల మందులు అమ్మితే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలో ఎరువుల దుకాణాలను ఏడీ శ్రీధర్, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి జైసింగ్, సహాయ వ్యవసాయ అధికారి శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు షాపుల్లో ఉన్న సరుకులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేనటువంటి మందులు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటివి జరిగితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ములుగు రూరల్: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని ఎస్సై వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు దాటే సమయంలో సెల్ ఫోన్‌లు చూస్తు నడవకూడదని అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్

ఆర్ట్స్ కళాశాలతో ఎంఓయూ

కేయూ క్యాంపస్: తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ములుగు ఐటీడీఏ ఏటూరునాగారం వారు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం, తెలుగు విభాగాలతో పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) శుక్రవారం కుదుర్చుకున్నారు. ఆకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య ఆధ్వర్యంలో.. టీటీడబ్ల్యూ ఆర్డీసీ ములుగు ఏటూరునాగారం కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.రాధిక, ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సంజీవ్ పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో ఆకళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ తిరుణహరిశేషు, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ శివకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతను పూడ్చిన నాయకులు



గుంతను పూడ్చివేయించిన నాయకులు, ఎస్సై

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల వద్ద ఏర్పడిన గుంతను దళిత సంఘాల నాయకులు, అడ్వకెట్ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పూడ్చివేయించారు. విద్యార్థులు, రోడ్డున వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఈ గుంతను పూడ్చివేసినట్లు ఎస్సై తెలిపారు. ఇందుకు దళిత సంఘాల నాయకులు ముందుకు ముందుకు వచ్చారన్నారు. వావిలాల స్వామి, సుదర్శన్, రాంబాబు, సాంబశివరావు, సతీష్, రవి పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన రేషన్ డీలర్లు

మొగుళ్లపల్లి: నూతనంగా వచ్చిన ఎస్సై మాధవ్ గౌడ్‌ను మండల రేషన్ డీలర్ల సంఘం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నిమ్మల భద్రయ్య, ప్రధాన కార్యదర్శి బజ్జూరి చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదమల్ల బాలకిషన్, వైస్ ప్రెసిడెంట్ సునీత ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

రేగొండ: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని షీ టీమ్ సీఐ అజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దన్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు బానిస కావొద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పడుతున్న శ్రమను గుర్తించి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం ఇంచార్జి శ్రీలత, సభ్యులు దేవేంద్ర, సజిద్, ఇర్ఫాన్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ అజయ్

యాదవులు సహకరించాలి

భూపాలపల్లి రూరల్: త్వరలో నిర్వహించనున్న అఖిల భారత యాదవ మహాసభ గ్రామ, మండల నూతన కమిటీల ఎన్నికకు యాదవులు సహకరించాలని మహాసభ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ కమిటీలు, మండల డివిజన్ కమిటీలు రద్దు చేసినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ఈ కమిటీలు అడహాక్ కమిటీలుగా పరిగణించబడుతాయన్నారు. వీరి ఆధ్వర్యంలో ఈనెల 31 లోపు నూతన కమిటీలు ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య మిత్రులు

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన సమ్మయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి బాల్య స్నేహితులు పరామర్శించి, రూ.8.500 ఆర్థిక సాయంగా అందజేశారు. దేవేందర్, రమేష్, అశోక్, భాస్కర్, రమేష్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజు, రాజేందర్, శ్రీను, సుమన్, శ్రీశైలం, అనిల్, హరికృష్ణ, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు మైనార్టీ గురుకులాల్లో చేరాలి



జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంకు కరపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

ఏటూరునాగారం: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులు చేరాలని కళాశాల అధ్యాపకులు రహీం, నగేష్, మల్లేష్, త్రిలోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మైనార్టీ కళాశాలలో చేరేందుకు విద్యార్థుల వివరాలు, తల్లిదండ్రుల సమాచారాన్ని అధ్యాపకులు సేకరించారు. ఈ మేరకు స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ సాంబశివరావుకు మైనార్టీ కళాశాల కరపత్రాలను అందిస్తూ మైనార్టీలు, ఇతర కులాల విద్యార్థులకు విద్యావకాశాలను కల్పించేలా చూడాలని కోరారు. స్థానికంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మైనార్టీ కళాశాలల్లో చేరాలని కోరారు. అంతేకాకుండా ఇతర వర్గాలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చేరే అవకాశాలున్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7995057981, 9989416061 సంప్రదించాలన్నారు.

అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ



శిక్షణ ఇస్తున్న సంయుక్త

ములుగు: అడవి జంతువులను వేటాడే వారిపై కేసుల నమోదుపై అటవీశాఖ సిబ్బందికి డబ్ల్యూసీటీ ముంబాయి వారి ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ నిర్వహించినట్లు అటవీ క్షేత్రాధికారి డోలి శంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో అటవీశాఖ కార్యాలయంలో ములుగు, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ అటవీశాఖ సిబ్బందికి డబ్ల్యూసీటీ సీనియర్ ట్రైనర్లు సంయుక్త, సంజయ్ గుప్తా శిక్షణ అందించారు. వేటగాళ్లపై కేసు నమోదు, చార్జిషీట్ కోర్టులో ఎలా వేయాలనే అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు ఓటరు నమోదు

ఏటూరునాగారం: ఈనెల 20, 21వ తేదీల్లో ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జనవరి 1 నాటికి వరకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారి కోసం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 28 పోలింగ్ కేంద్రాల్లో 18 ఏళ్లు నిండిన వారు ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవాలని, సవరణలకు ఫారం 8, తొలగింపుకు ఫారం 7 ద్వారా దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెంకటాపురం(కె): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ సర్వర్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు(శనివారం) రేపు(ఆదివారం) రెండు రోజులు పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటర్ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న సర్వర్ పాషా

వాజేడు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శని, ఆదివారాల్లో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని బీఎల్ఓ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

11న ఆదివాసీ తెగల సమ్మేళనం



మాట్లాడుతున్న ఉపేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క– సారలమ్మ జాతర సందర్భంగా ఫిబ్రవరి 11న మేడారంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ తెగల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ తెలిపారు. శుక్రవారం సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా జాతీయ ఆదివాసీ తెగల సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మేళనం ఆనవాయితీగా రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారం జాతర సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి తెగల పెద్దలు, నాయకులు కలిసి ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై చర్చిస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ పోరాట స్ఫూర్తితో ఆదివాసి సంఘాలు, రాజకీయ పార్టీలకతీతంగా ఆదివాసీ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించేందుకు ఈ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

చిట్యాల: మద్యం తాగి వాహనదారులు వాహనాలను నడపొద్దని సీఐ.వేణుచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివాజీ సెంటర్లో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాదారుల వద్ద సరైనా అనుమతి పత్రాలు లేకపోవడంతో పది మందికి చలానా విధించారు. అలాగే నంబర్ ప్లేట్ లేని కారణంగా రెండు వాహనాలను సీజ్ చేశారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాదారులు ఎవరూ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని ఒక వేళ తల్లిదండ్రులు ఇస్తే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, పోలీస్ సిబ్బంది గౌస్, వీరారెడ్డి, రవి, లాల్ సింగ్, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అనుమతి పత్రాలు కలిగి ఉండాలి

మొగుళ్లపల్లి: వాహనం నడిపే ప్రతి వాహనదారుడి వద్ద అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సీఐ వేణుచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చలివాగు పెద్ద బ్రిడ్జీ వద్ద సీఐ వేణుచందర్, ఎస్సై మాధవ్ గౌడ్ శుక్రవారం వాహనాలను తనిఖీ చేపట్టారు. అనంతరం సీఐ వేణుచందర్ మాట్లాడుతూ.. వాహనాదారులు వాహనం నడిపేటప్పుడు తప్పకుడా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ